ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
సోమవారం 25 ఆగస్టు 2025

పండుగ చేద్దాం.. పైలంగా..

గణపతి నవరాత్రోత్సవాలకు సిద్ధం



విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

- 27న వినాయక చవితి వేడుకలు
- జిల్లా ప్రారంభమైన వినాయకుల సందడి
- మండపాలకు తరలుతున్న గణనాథులు
- భారీగా పెరిగిన విగ్రహాల ధరలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు
- నిర్లక్ష్యం వీడాలని సూచన
- విద్యుత్ వైర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

జనగామ కల్చరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆది దేవుడు.. సర్వ విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరుడు. ఏటాజరిగే గణపతి నవరాత్రోత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈనెల 27న వినాయక చవితిని పురస్కరించుకుని వీధుల్లో ఇప్పటి నుంచే మండపాలను ముస్తాబు చేస్తున్నారు. దీంతో జిల్లాలో వినాయక విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు విగ్రహాలను తయారు చేయడం ప్రారంభిస్తారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నవరాత్రుల నిర్వహణకు గణపతి మంటపాల నిర్వాహకులు విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. రాజస్థాన్ కు చెందిన తయారీదారులు ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని విగ్రహాలు తయారుచేస్తూ జీవనోపాధి పొందుతుంటారు. ఒక్క అడుగు నుంచి 20 అడుగుల వరకు విగ్రహాలను అనేక ఆకృతులతో తయారు చేశారు. జిల్లాతోపాటు పొరుగు జిల్లాలకు చెందిన మండపాల నిర్వాహకులు ఈ విగ్రహాలు కొనుగోలు చేస్తుంటారు.

గతం కంటే పెరిగిన విగ్రహాల ధరలు ..

వినాయక విగ్రహాల ధరలు ప్రతీ సంవత్సరం అంతకంతకూ పెరిగిపోతున్నాయి. విగ్రహాల తయారీకి ఉపయోగించే ముడిసరుకుల ధరలు పెరగడంతో ఈసారి విగ్రహాల ధరలు కూడా పెరిగాయి. గతంలో ఉన్న ధరల కంటే 50శాతం ధరలు పెరిగాయని విక్రయదారులు చెబుతున్నారు. ఆరు ఫీట్ల విగ్రహాలు రూ.5వేల నుంచి రూ.6వేలు, ఎనిమిది ఫీట్లవి రూ.7,500 నుంచి రూ.8,500, 10ఫీట్లవి రూ.9,500 నుంచి (మిగతా 8వ పేజీలో)

పోలీసుల సూచనలు...

- మండపాలను ప్రశాంతమైన స్థలంలో ఏర్పాటు చేయాలి.
- ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేస్తే వారి అనుమతి తీసుకోవాలి.
- మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి.
- ఇరుకు వీధుల్లో ఏర్పాటు చేయరాదు.
- మండపాల బాధ్యత నిర్వాహకులదే.
- మండపం వద్ద కనీసం ఒక్కరైనా వలంటీర్ ఉండాలి.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- మండపంలో మండే పదార్థాలు, టపాకులు ఉంచరాదు.
- చిన్నపాటి సౌండ్ బాక్స్‌లు మాత్రమే ఉంచాలి.
- డీజేలకు అనుమతి లేదు.
- రాత్రి 10గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి
- అత్యవసరమైతే డయల్ 100లో పోలీసులను సంప్రదించాలి.

విద్యుత్ అధికారుల సూచనలు ..

- ఎత్తైన విగ్రహాలు తీసుకువచ్చేటప్పుడు విద్యుత్ లైన్లు అడ్డం వస్తే అధికారులకు తెలియజేసి విద్యుత్ సరఫరాను నిలిపివేసిన తర్వాత మాత్రమే తీసుకురావాలి
- మండపాల దగ్గర విద్యుత్ సరఫరాకు రూ.500 డీడీని విద్యుత్ శాఖకు చెల్లిస్తే కనెక్షన్ ఇస్తారు.
- వర్షాకాలం కాబట్టి మండపాల దగ్గర ఇనుప పైపులతోని మండపం నిర్మించుకుంటే కరెంట్ వైరును దానికి చుట్టవద్దు.
- మండపానికి విద్యుత్‌ను సరఫరా చేసే వైరు స్టాండర్డ్‌గా ఉన్నది మాత్రమే వాడాలి. అతుకుల వైరును వాడొద్దు.
- గణేష్ మండపాలకు, విగ్రహాలకు చిన్న చిన్న లైట్లు వాడకూడదు.
- కమిటీ సభ్యులకు ఏమైనా విద్యుత్ ప్రమాదం జరిగినా, విద్యుత్ సరఫరాలో అతరాయం ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలి.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలే ...

వినాయక విగ్రహాలను అందమైన ఆకృతిలో తయారు చేయడానికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ)ను తయారీదారులు ఉపయోగిస్తారు. ఇది నీటిలో గానీ, మట్టిలో గానీ కరగవు. ఫలితంగా పర్యావరణానికి ముప్పు కలుగుతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి విగ్రహాలతో పోల్చితే తక్కువ ధరలకు లభిస్తుండడంతో నిర్వాహకులు ఎక్కువగా పీఓపీ విగ్రహాలకే మొగ్గుచూపుతున్నారు. పలు రూపాల్లో ఉన్న విగ్రహాలు ఆకర్షిస్తుండడంతో మండపాల నిర్వాహకులు కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. ఒక్కో విగ్రహం ఆకృతి, పరిమాణం బట్టి రూ.వెయ్యి నుంచి రూ.25వేల వరకు ధర పలుకుతోంది.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి



ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి

జనగామ రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి పరిశుభ్రంగా ఉంచాలని ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి బంధువులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని ముఖ్య ఉద్దేశ్యంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ప్రజల ఆరోగ్య భద్రత కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కల్నాల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, టీపీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్, నాయకులు నూకల బాల్‌రెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, డాక్టర్ రాజమౌళి, ధర్మ గోవర్ధన్‌రెడ్డి, చిర్ర హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

రూ. 3వేలు.. 200 ట్రిప్పులు

- వార్షిక 'టోల్' పాస్‌తో తగ్గిన ఆర్థిక భారం
- రూ.16 వేల నుంచి రూ.19 వేల వరకు ఆదా
- హ్యాపీ టోల్ ప్లాజా అంటూ.. వెళ్తున్న వాహనదారులు

7

జనహిత పాదయాత్రకు సర్వం సిద్ధం

- నేడు వర్ధన్నపేట నియోజకవర్గంలో యాత్ర
- పాల్గొననున్న మీనాక్షి, మహేష్‌కుమార్
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్ నేతలు
- 150 మందితో పోలీసుల భారీ బందోబస్తు



ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జనహిత పాదయాత్రకు వర్ధన్నపేట నియోజకవర్గం సర్వం సిద్ధమైంది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావులు.. పాదయాత్ర, కార్నర్ మీటింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి సోమవారం సాయంత్రం 5 గంటలకు పాదయాత్ర ప్రారంభమై, పార్టీ జెండాను, రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వర్ధన్నపేట వరకు యాత్ర కొనసాగుతుంది. వర్ధన్నపేటలోని అంబేద్కర్ సెంటర్‌లో రాత్రి కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తిరిగి రాత్రి 9 గంటల లోపే మీటింగ్ ముగించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. కాగా, పాదయాత్ర చేసే వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిని మునిసిపాలిటీ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన మట్టిని జేసీబీ, డోజర్ల సహాయంతో తీసివేస్తున్నారు. ఆకేరు వాగు బ్రిడ్జిపై ఉన్న చెత్తచెదారాన్ని, మట్టిని తొలగిస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం వస్తున్న తరుణంలో ఇల్లంద నుంచి వర్ధన్నపేట వరకు భారీగా ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ఈ పాదయాత్రలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి,మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), ఎంపీలు పోరిక బలరాంనాయక్, డాక్టర్ కడియం కావ్య, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, ఆయా జిల్లాల కాంగ్రెస్ నేతలు పాల్గొంటారని చెపుతున్నారు. పదివేల మందితో పాదయాత్ర జరిగేలా నాయకులు ప్లాన్ చేస్తున్నారు. ఇటు స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, మహబూబాబాద్ నియోజకవర్గాల నుంచి సైతం కాంగ్రెస్‌నాయకులుతరలిరానున్నారు. ఇల్లంద గ్రామంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ జెండా ఎగురవేసే తాత్కాలిక స్థలాన్నిచూసి నాయకులు దిశానిర్దేశం చేశారు.

150 మందితో పోలీసుల బందోబస్తు

కాంగ్రెస్ జనహిత పాదయాత్రకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జనగామ డీసీపీ ఆధ్వర్యంలో ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, 90 మంది ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీలు మోహరించనున్నారు. ఇక పాదయాత్ర సమయంలో రోప్ పార్టీలు రెండు రానున్నాయి. కమిషనరేట్ నుంచి స్పెషల్ పోలీసులు 40మంది బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోస్తు చేస్తున్నట్లు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. పాదయాత్రకు వచ్చే నాయకులను చూసి, యాత్ర తీరును చూసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దాదాపు గంట పాటు యాత్ర సాగుతుందని, ఆ మేరకు ట్రాఫిక్ మళ్లింపు లేదా భారీ వాహనాల నిలిపివేత దిశగా నిర్ణయం తీసుకోనున్నారు.

సౌరశక్తి వినియోగంలో అగ్రగామిలో నిలబెట్టాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సౌరశక్తి వినియోగంలో రాష్ట్రాన్ని అగ్రగామిలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గ్రామ పంచాయతీ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయంలో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలలు, కళాశాలలు, డిగ్రీ కళాశాలలో పెద్ద ఎత్తున సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి సౌర విద్యుత్ ఉత్పత్తి దిశగా ప్రభుత్వం కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

సౌరశక్తి వినియోగి ంచేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. సోలార్ ప్లాంట్లతో పర్యావర ణానికి ఎంతో మేలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సోలార్ ప్లాంట్ ప్రాజెక్ట్‌కు సబ్సిడీ అందిస్తుందన్నారు. జనగామ జిల్లాలో ఇప్పటివరకు 230 మంది దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని తెలిపారు.

ఉపాధ్యాయుడిపై హత్యాయత్నం కేసు

- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- ఉద్యోగం నుంచి తొలగించిన కలెక్టర్
- అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విష ప్రయోగంపై చర్యలు



ఉపాధ్యాయుడి అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తాగునీటిలో విషం కలిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడిన భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు పెండ్యాల రాజేందర్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. అతడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలనుసారం ఈ చర్యలు తీసుకున్నట్టు డీఎస్పీ సంపత్ రావు తెలిపారు. మరోవైపు రాజేందర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాలలో ఈ నెల 21 రాత్రి తాగునీటి ట్యాంకులో సైన్స్ ఉపాధ్యాయుడు రాజేందర్ గడ్డి మందు కలిపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనలో 11 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు. సైన్స్ ఉపాధ్యాయుడు రాజేందర్ ఈ దారుణానికి పాల్పడ్డాడని వెల్లడైంది. హాస్టల్ ప్రత్యేక అధికారిపై నెపాన్ని నెట్టేందుకు కుట్ర చేసిన రాజేందర్.. విద్యార్థులు తాగే నీళ్లల్లో గడ్డిమందు కలపాడని విచారణలో తేలింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రాజేందర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా? అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిని ఉపేక్షించొద్దు : మానవ హక్కుల వేదిక

అభం, శుభం ఎరుగని విద్యార్థులపై విష ప్రయోగానికి పాల్పడిన ఉపాధ్యాయుడు రాజేందర్‌ను ఉపేక్షించొద్దని మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దిలీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు శ్రీనివాస్, సమ్మయ్య. (మిగతా 8వ పేజీలో)

తెలుగుతేజం అవార్డుకు సత్యనారాయణ ఎంపిక



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసారావుపేటలో ఈ నెల 31న కవులకు ప్రదానం చేయనున్న తెలుగు తేజం అవార్డుకు ఎంపికైనట్లు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కవి గుర్రపు సత్యనారాయణకు ఈనెల 23న ఆహ్వానం అందింది. అంతర్జాతీయ సాహితీ సంస్కృతి సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అందించనున్న తెలుగు తేజం అవార్డును తెలంగాణ రచయితల వేదిక మానుకోట జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అందుకోనున్నారు. తెలుగు భాష, సంస్కృతి, తెలుగు సాహిత్యం, పరిరక్షణ కోసం సత్యనారాయణ రెండున్నర దశాబ్దాల నుంచి చేస్తున్న కృషికి గాను అవార్డుకు ఎంపిక కావడం పట్ల కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు 48 మంది ఎంపిక



యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో సెప్టెంబరు 5 నుంచి 7 వరకు జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు 48 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తూనం పుష్పలీల, గుజ్జునూర్ నరేష్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయిలో సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికలకు యోగా పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఈ పోటీల్లో 100 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 48 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు డీపీఎం ఆయుష్ డిపార్ట్‌మెంట్ జిల్లా అధికారి శ్రవణ్, హెచ్ఎం కోటియా, మాస్టర్ అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి పద్మావతి మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు రాజకుమారి, నిర్మల, భారతి, వసంత, పావని, వీరభద్రం, రవి తదితరులు పాల్గొన్నారు.

విషప్రయోగంపై సీబీఐతో విచారణ చేపట్టాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న కీర్తిరెడ్డి

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులపై జరిగిన విషప్రయోగంలో అనేక కుట్ర కోణాలు ఉన్నాయని, దీనిపై సీబీఐతో విచారణ చేపడితే నిజనిజాలు బహిర్గతం అవుగాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులను ఆదివారం ఆమె పరామర్శించారు. ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు గానీ, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ దక్కించుకునేందుకు ఎవరైనా బడాబాబులు గానీ ఈ దారుణానికి పాల్పడి ఉండొచ్చనే కోణంలో సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్ తదితరులు ఉన్నారు.

విషజ్వరాల విజృంభణ



ములుగు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో జ్వర పీడితులు

- వణుకుతున్న గిరిజనం
- ములుగు జిల్లాలో 45 మలేరియా, 28 డెంగీ కేసులు
- వ్యాధులు ప్రబలకుండా చర్యలు శూన్యం
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- టెస్టుల పేరిట డబ్బులు గుంజుతున్న ప్రైవేటు యాజమాన్యాలు

ములుగు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జిల్లాలో ఇప్పటికే 45 మలేరియా, 28 డెంగీ కేసులు నమోదు అయినట్లు అధికారులు చెబుతున్నారు. విషజ్వరాలు పంజా విసురుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రోగులతో ఆస్పత్రులు కిటకిట లాడుతున్నాయి. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు టెస్టుల పేరిట పీడిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలు, పట్టణంలో మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వాటి నియంత్రణ కోసం ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాల్సిన మునిసిపల్, జీపీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విష జ్వరాలు ప్రబలకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెబుతున్నా అది ఆచరణలో కనిపించడం లేదని పలువురు అంటున్నారు.

దోచుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని టెస్టుల పేరిట ప్రజలను దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సాధారణ జ్వర పరీక్షలకు వేల రూపాయలు వసూలు చేస్తూ, డెంగీ పేరిట లక్షలు గుంజుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వణుకుతున్న గిరిజనం

ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు ప్రజల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. మలేరియా, డెంగీ కేసులు పెరుగుతుండడంతో ఆదివాసీ, గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల జిల్లాలో 45 మలేరియా, 28 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దోమల నియంత్రణలో అధికారుల నిర్లక్ష్యం, పారిశుధ్యం పట్ల ఉదాసీనత కనిపిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో జీపీ సిబ్బంది పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే ఉందని, డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దోమల నియంత్రణకు కలెక్టర్ చర్యలు చేపడుతున్నామని చెబుతున్నా కాలనీల్లో కనీసం ఫాగింగ్, బ్లీచింగ్ చేయకపోవడంతో విజృంభిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ఖాళీ స్థలాల్లో నీరు పేరుకుపోయి ఉండడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. వాటి నియంత్రణకు మునిసిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగం శ్రద్ధ తీసుకుని విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

జిల్లాలో 45 మలేరియా, 28 డెంగీ కేసులు

ములుగు జిల్లా వ్యాప్తంగా 45 మలేరియా, 28 డెంగీ, 190 టైఫాయిడ్ కేసులు నమోదైనట్లు వైద్యశాఖ అధికారులు తెలిపారు. డెంగీ, మలేరియా వివరాలు పీహెచ్‌సీల వారీగా ఇలా ఉన్నాయి. వెంకటాపూర్ పీహెచ్‌సీ పరిధిలో 1 డెంగీ కేసు నమోదు కాగా, మలేరియా కేసులు నమోదు కాలేదు. రాయినిగూడెం పీహెచ్‌సీలో 8 డెంగీ, 1 మలేరియా, గోవిందరావుపేట పీహెచ్‌సీ పరిధిలో 1 మలేరియా, డెంగీ కేసులు లేవు. పస్రా పీహెచ్‌సీలో 2 డెంగీ, 1 మలేరియా, తాడ్వాయి పీహెచ్‌సీలో 4 మలేరియా, 3 డెంగీ, కాటాపూర్‌లో 2 డెంగీ, మలేరియా కేసులు లేవు. కొడిశాలలో 3 డెంగీ, 2 మలేరియా, కన్నాయిగూడెంలో 1 డెంగీ, 20 మలేరియా, రొయ్యూరులో 3 డెంగీ, 5 మలేరియా, మంగపేటలో 5 డెంగీ, మలేరియా కేసులు లేవు. పేరూరులో 3, డెంగీ కేసులు లేవు. ఏదిర పీహెచ్‌సీలో 8 మలేరియా కేసులు నమోదు కాగా, డెంగీ లేదు. అయితే చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి, వాజేడు పీహెచ్‌సీల పరిధిలో డెంగీ, మలేరియా కేసులు లేవని అధికారులు చెబుతున్నారు.

కేసులు తగ్గుముఖం పట్టాయి..



గత రెండు సంవత్సరాల కంటే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు సంఖ్య చాలా వరకు తగ్గింది. గతంలో కంటే వైద్య శిబిరాలను అధికంగా ఏర్పాటు చేసి ఎక్కువ సంఖ్యలో పరీక్షలు నిర్వహించాం. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధుల నియంత్రణ పట్ల ప్రత్యేక దృష్టి సారించాం.

– డాక్టర్ చంద్రకాంత్, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి, ములుగు

అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

డోర్నకల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా.. అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని రాష్ట్ర మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఆదివారం డోర్నకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసే పరిస్థితి ఏర్పడిందని, దానికి ప్రభుత్వమే కారణమన్నారు. డోర్నకల్ నియోజకవర్గం నుంచి గెలిచిన శాసనసభ్యులు ప్రజా సమస్యలను వదిలేసి హైదరాబాద్‌లో సొంత పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా చెరువులు, కుంటలు నింపడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో మహబూబాబాద్ జిల్లా అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉండేదని, ఇప్పుడు అవినీతిలో ప్రథమ స్థానం పొందిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తీవ్రంగా ఉందన్నారు. సీఐ స్థాయి అధికారులు అవినీతి నిరోధక శాఖకు పట్టుబడుతున్నారని తెలిపారు. జిల్లాలో గంజాయి, ఇసుక, మట్టి, బెల్లం, గుట్కాల మాఫియా రాజ్యమేలుతున్నా వాటిని నియంత్రించే యంత్రాంగం వైఫల్యం చెందిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనలో వైఫల్యం చెందడంతో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మన్యుపాట్నీ, యశోదర్ జైన్, గౌసపాషా, కందుల మధుసూదన్, బారబోయిన రాంభద్రం, నందానాయక్ పాల్గొన్నారు. తొలుత డోర్నకల్ మండలం అమ్మపాలెంలో ఇటీవల మృతి చెందిన కాపరబోయిన కోటయ్య కుటుంబ సభ్యులను సత్యవతి రాథోడ్ పరామర్శించారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- పార్టీని మరింత బలోపేతం చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అవుతాపురం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు సల్లెండి మంజుల సుధాకర్‌తో పాటు పలువు రు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్ ప్లాప్ అయ్యిందని, ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వం పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని ధ్వజమెత్తారు. పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక మూడున్నరేళ్ల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్నది ప్రజాపాలన కాదని, పేద ప్రజల ను దోచే పాలన అన్నారు. రాష్ట్రంలోని ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయ ని, 420 హామీలు గాలిలో కలిశాయని, ఆ పార్టీపై ప్రజలకు విశ్వా సం పోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ రాగానే కరువు, యూరి యా కష్టాలు మళ్లీ మొదలైనట్లు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండానే ఎగురుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గడపగడపకూ వివరించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, తొర్రూరు మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థానం మాజీ చైర్మన్ వి.రామచంద్రయ్య, పాకనాటి సునీల్ రెడ్డి శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, సోమ నర్సింహారెడ్డి, రామోజీ, సమ్మయ్య, వెంకన్న, రాము, అశోక్, రవి, వెంట్రామయ్య, రాము, శ్రీనివాస్, పటేల్, భాస్కర్, రాజేందర్, రాము, గంగాధర్, కుమార్, రఘు, హరీశ్, వేణు, సతీష్, రాంమూర్తి, అనిల్, మహేష్, ప్రదీప్, శేఖర్, సుభాష్, అనుదీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్‌వోగా ప్రియాంక

మొగుళ్లపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొర్కిశాల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఎస్‌వోగా ప్రియాంక ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన శైలజను ఫుడ్‌పాయిజన్ ఘటనలో శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ పూర్తిగా విధుల నుంచి తొలగించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ప్రియాంకకు ఎస్‌వోగా బాధ్యతలు అప్పగించారు.

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ధర్మసాగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం ధర్మసాగర్ మండలకేంద్రంలోని స్నేహకాలనీ, పెద్దపెండ్యాల గ్రామంలో జరిగిన సీసీరోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కొత్త రేషన్ కార్డు దారులకు సెప్టెంబరు ఒకటి నుంచి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ జరుగుతోందన్నారు. పెద్దపెండ్యాల గ్రామానికి రూ.46లక్షల నిధులు, స్నేహకాలనీకి రూ.25లక్షల నిధులు సీసీరోడ్లు నిర్మాణం కోసం మంజూరు చేసినట్టు తెలిపారు. ధర్మసాగర్ స్నేహ కాలనీవాసులు మిషన్ భగీరథ నీరు రావడం లేదని తన దృష్టికి తీసుకువచ్చారని, డీఈఈని వెంటనే కాలనీకి పంపిస్తామన్నారు. త్వరలో స్నేహకాలనీలో వాటర్ ట్యాంక్, పైపులైన్ నిర్మాణం చేపట్టి తాగునీటిని అందిస్తామన్నారు. గతంలో కాలనీలో ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసిన భూమి ఆక్రమణకు గురవుతుందని సర్వే నిర్వహించి హద్దులను పాతాలని తహసీల్దార్ సదానందంకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, మార్కెట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్‌గా స్రవంతి

నర్సంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):వరంగల్ జిల్లా నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్‌గా స్రవంతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మహిళా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పెండ్యాల సుచరిత మృతికి సంబంధించి జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశృతి నిర్లక్ష్యమే కారణమని అంతర్గత విచారణలోతేలడంతో శనివారం సస్పెన్షన్ చేస్తూ జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. లక్ష్మీశృతి స్థానంలో వరంగల్ మహిళా జైలులో జైలర్‌గా పనిచేసిన స్రవంతిని నర్సంపేట మహిళా జైలు సూపరింటెండెంట్‌గా నియమించారు.



ప్రమాదంలో గాయపడిన నిఖిల్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మంగపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కమలాపురం సాయిబాబా ఆలయం కాలనీకి చెందిన యువకుడు నిఖిల్ భవన నిర్మాణం పనుల నిమిత్తం కొత్తపేటకు బైక్‌పై బయల్దేరాడు. బోరునర్సాపురం సమీపంలో జబ్బోనిగూడెం క్రాస్ వద్ద వరి పొలంలో కలుపు తీస్తున్న కూలీలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వారిని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో తలకు తీవ్రంగా గాయాలై స్పృహ తప్పి కింద పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా అతడిని ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. కాగా, నిఖిల్ పరిస్థితి విషమంగానే ఉందంటూ అక్కడి వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రిఫర్ చేశారు.

జీవించే హక్కును హరిస్తున్న పాలకులు

- ప్రశ్నించే గొంతుకలను నక్సల్స్‌గా ముద్ర
- ఆదివాసీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి
- అరెస్టు చేసిన వేదిక నేతలను వెంటనే విడుదల చేయాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

వడ్డెపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):ఆదివాసీ ప్రజల జీవించే హక్కును పాలకులు హరిస్తూ, ప్రశ్నించే గొంతుకలను నక్సల్స్‌గా ముద్ర వేస్తున్నారని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నిర్వహించాల్సిన బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో పాలకుల దమననీతిని వ్యతిరేకిస్తూ ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడారు.

పాలకుల నిర్బంధం నీడలో ప్రజలు జీవన మనుగడ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పాలక ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించి తీరుతామని హెచ్చరించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, శాంతి చర్చలను కొనసాగించాలని మావోయిస్టులు ఎన్నోమార్లు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ వారు పెడచెవిన పెడుతున్నారని అన్నారు. ఎన్‌కౌంటర్ పేరుతో అణచివేస్తున్న ఆదివాసీల, ఉద్యమకారుల జీవించే హక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షించాలని, కాల్పుల విరమణను వెంటనే ప్రకటించి, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని గడ్డం లక్ష్మణ్ కోరారు. 1996 పీసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బస్తర్‌లో ఏర్పాటు చేసిన వందలాది సాయుధ బలగాల క్యాంపులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ భవన్‌లో నిర్వహించతలపెట్టిన ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక బహిరంగ సభకు వచ్చే వేదిక నాయకులను ముందస్తుగానే శనివారం రాత్రి నిర్బంధంగా అరెస్టు చేశారని దుయ్యబట్టారు. చైతన్య మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు జ్యోతక్కను గద్వాలలో, సీఎల్‌సీ నేతలు కుమారస్వామిని కరీంనగర్‌లో, పెద్దపెల్లిలో రవీందర్‌ను, రత్నకుమార్‌ను, బారసాని రాజయ్యను, మాడుగుల మల్లయ్యను అరెస్టు చేశారని, వీరందరిని బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక, వివిధ ప్రజా సంఘాల నేతలు ఎన్.నారాయణరావు, ఆజాద్, రమేష్ చందర్, చార్వాక, జక్కుల వెంకటయ్య, నున్న అప్పారావు, గంగుల దయాకర్, రాచర్ల బాలరాజు, గుడి కందుల క్రాంతి, పోరిక ఉదయ్‌సింగ్, సమ్మయ్య రాథోడ్, కరుణాకర్ నాయక్, శాంత, అనిత, భూక్య శ్రీనివాస్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అధునాతనం.. అత్యాధునికం..

» ఐటీఐల్లో అప్‌డేట్ ఎడ్యుకేషన్
» ఉపాధే లక్ష్యంగా టెక్నికల్ కోర్సులు
» త్వరగా ఉద్యోగం పొందే అవకాశం



భూపాలపల్లిలోని ఏటీసీ సెంటర్

భూపాలపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులకు ఐటీఐ విద్యాబోధన వరంగా మారింది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని.. అధునాతన పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చి ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ముఖ్యంగా పరిశ్రమలు, ఉత్పత్తి, తయారీ కేంద్రాల్లో అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి. అంతటితో ఆగిపోకుండా అనంతరం ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. విద్యార్థులకు నూతన ఒరవడితో విద్యను అందించేందుకు ఐటీఐలను నేడు ఏటీసీలు (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్)గా అప్‌గ్రేడ్ చేసి విద్యార్థులకు నూతనంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్‌తో పాటు వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ తదితర కోర్సులను అందిస్తోంది. కోర్సులు పూర్తి చేసిన వారు స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలు పొందడానికి ప్రభుత్వం వీలు కల్పించింది.

ఉన్నత విద్యకు అవకాశం..

ఐటీఐ తర్వాత డిప్లొమా కోర్సుల్లో చేరడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. కొన్ని బ్రాంచీల్లో లేటరల్ ఎంట్రీతో నేరుగా ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో చేరిపోవచ్చు. డిప్లొమా తర్వాత ఆసక్తి ఉంటే ఈసెట్ ద్వారా నేరుగా రెండో సంవత్సరం బీటెక్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. నాన్ ఇంజనీరింగ్ బ్రాంచీల్లో ఐటీఐ ట్రేడ్‌లు పూర్తి చేసిన వారు డిగ్రీ (బీఏ), అనంతరం పీజీ (ఎంఏ) కోర్సులు కూడా చదువుకోవచ్చు.

విదేశాలకు వెళ్లే చాన్స్

ఏటీసీల్లో కోర్సులు పూర్తి చేసి అర్హత సాధించిన విద్యార్థులు స్వదేశంలోని కంపెనీల్లోనే కాకుండా విదేశాల్లోకి వెళ్లవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్), ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ వారు విదేశీ ఉద్యోగాలకు దారి చూపుతున్నాయి. ఇవి శిక్షణ అందించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నాయి. వీటిని పొందిన వారు కేంద్రంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ ద్వారా విదేశీ ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు. అలాగే టాటా కంపెనీ అనేక అవకాశాలను అందించనుంది.


ఏటీసీలో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు

శిక్షణ పొందిన అధ్యాపకులతో బోధన

తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా ఆరు కొత్త కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఏటీసీ కేంద్రాల్లో నూతన ఒరవడి కోసం సాంకేతికంగా శిక్షణ పొందిన అధ్యాపకులతో విద్యాబోధన చేయిస్తోంది. ఈ కోర్సులను గతేడాది సెప్టెంబరులోనే ప్రారంభించినా అడ్మిషన్లు అనుకున్న స్థాయిలో కాలేదు. ఇప్పుడు రెండో దశలో సీరియస్‌గా తీసుకుంది. అధ్యాపకులను సైతం నియమించింది.

కోర్సులు.. విద్యార్హతలు..

ఐటీఐ/ఏటీసీ కేంద్రాల్లో నూతనంగా ఆరు ట్రేడ్లను ఏర్పాటు చేశారు. దీనిని టాటా కంపెనీ వారి సహకారంతో ఈ గ్రూపులను ఏర్పాటు చేశారు. వీటిలో రెండు సంవత్సరాల కోర్సులతో పాటు సంవత్సరం పాటు చేసే కోర్సులు కూడా ఉన్నాయి. అందులో మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమోషన్ (ఎస్ఎస్‌క్యూఎఫ్) కోర్సు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సు, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ కోర్సులు ఏడాది పాటు ఉంటాయి. అలాగే వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్ కోర్సు, సీఎన్‌సీ మ్యాచినింగ్ టెక్నీషియన్ కోర్సు, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులు రెండేళ్ల పాటు ఉంటాయి. ఒక్కో ట్రేడ్‌లో 24 నుంచి 40 సీట్ల వరకు అవకాశాలున్నాయి. ప్రస్తుతం భూపాలపల్లి ఐటీఐ /ఏటీసీ కేంద్రంలో 172కు గాను 42 మాత్రమే సీట్లు ఉన్నట్లు ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ తెలిపారు. ఇందులో ఎక్కువగా మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులో 22 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సులో 10 సీట్లు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

ఏటీసీ కోర్సులతో ఉపాధి
- జుమ్లానాయక్, ఏటీసీ ప్రిన్సిపాల్, భూపాలపల్లి



త్వరగా ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందాలనుకునే విద్యార్థులకు ఇది సువర్ణావకాశం. ఇంకా కొన్ని సీట్లు మాత్రమే ఉన్నాయి. ఈ నెల 28వ తేదీలోపే దరఖాస్తు చేసుకోవాలి. లేకపోతే ఐటీఐకి వచ్చి అన్ని సర్టిఫికెట్లు, ఫొటోలతో చేసుకోవచ్చు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి త్వరగా ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి.


పంథిని శివారులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అనుమతులు లేకుండా
దర్జాగా వెంచర్లు

- కాగితాలపై మార్కింగ్‌తో ప్లాట్ల విక్రయాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

ఐనవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువా అన్న చందంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. రైతుల వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే వెంచర్లుగా మార్చి ప్లాట్లను పేపర్‌పై డ్రాయింగ్ వేసి విక్రయానికి పెడుతున్నారు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారికి 500 మీటర్ల సమీపంలో పంథిని-పున్నేలు గ్రామాల మధ్య మట్టిరోడ్డుకు ఆనుకొని సర్వే నెంబర్ 32, 33లలో 3 ఎకరాల ప్రైవేటు భూమిలో కేవలం వారం రోజుల్లో నాలా కన్వర్షన్ చేయకుండానే వెంచర్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాదు వెంచర్ చుట్టు ప్రీకాస్ట్ వాల్‌ను నిర్మించి సుందరంగా తీర్చిదిద్ది విక్రయానికి పెట్టారు. అయితే వెంచర్‌కు జాతీయ రహదారి నుంచి పోయే పున్నేలు బైపాస్ మట్టి రోడ్డుకు ఇరువైపుల గత సంవత్సరం ఆగస్టులో ఉపాధి హామీ పథకంలో ఎవెన్యూ (రహదారి వెంబడి నీడనిచ్చే) మొక్కలను నాటి జీపీ ట్యాంకర్ ద్వారానీటిని అందిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏకంగా రోడ్డు వెంబడి పెట్టిన మొక్కలను ఒకవైపు యంత్రాల ద్వారా తొలగించి రోడ్డును వెడల్పు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా పున్నేలు శివారులో జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన బృందావనం వెంచర్‌లో గొలుసు బాట(బండ్ల బాట) నక్షలో ఉండగా దాన్ని దర్జాగా వెంచర్లో కలిపేసుకున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. చింతకుంట క్రాస్‌రోడ్డు సమీపంలో వజ్ర పేరిట ఏర్పాటు చేసిన వెంచర్‌లో 20 గుంటల కట్టు కాల్వ (ప్రభుత్వం)ఉంది ఉపాధి పనుల్లో కాలువలో పూడిక మట్టిని సైతం తీశారు. ఇప్పుడు ఆ 20గుంటల కాల్వను వెంచర్‌లో కలిపేసుకొని ప్లాట్లు చేసి వరద నీరు రాకుండా చేశారని స్థానికులు ఫిర్యాదులు చేసినా ఇంత వరకు పట్టించుకోలేదని వాపోయారు. పున్నేలు క్రాస్ రోడ్డు కమాన్ పక్కనే ఉన్న అసైన్డ్ భూమిని పీవోటీ చట్టానికి విరుద్ధంగా అమ్మకాలు చేయగా ఫిర్యాదులు చేశారు. రంగ సముద్రం ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోసి నీరు రాకుండా ప్లాట్లు చేసి ప్రహరీ నిర్మించారు. ప్రహరీని తొలగించాలని ఇరిగేషన్ అధికారులు సూచించినా ఇంత వరకు రియల్ ఏస్టేట్ వ్యాపా రులు తొలగించలేదు.వీటన్నింటిపై కలెక్టర్ చొరవతీసుకొని విచారణ జరిపిప్రభుత్వ, అసైన్డ్ భూములను రక్షించి ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం.. ఈ విషయమై 'కుడా' జేపీవో కె.శంకర్‌ను వివరణ కోరగా.. కుడా లేఅవుట్ అనుమతులకు దరఖాస్తు చేసుకోనందున పంథిని జీపీ కార్యదర్శి మాలతితో కలిసి సర్వే నెంబర్ 32, 33 లో నిర్మించిన గోడకు నోటీసును అంటించి హద్దురాళ్లను తొలగించినట్టు తెలిపారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌ను వివరణ కోరగా.. 'పంథిని శివారులో వెంచర్ చేసిన వ్యవసాయ భూమి (వ్యవసాయేతర భూమి) నాలా కన్వర్షన్ జరగలేదు.. అందుకు సంబంధించిన నోటీసు పంపిస్తున్నాం... మండలంలో ఎక్కడైన అనుమతులు లేకుండా వెంచర్లు చేసినా, ప్రభుత్వ భూములను కబ్జా చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.' అని తెలిపారు. అలాగే ఎంపీడీవో నర్మద మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపుల నాటిన ఎవెన్యూ మొక్కలను తొలగిస్తే వెంచర్ నిర్వాహకులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరంగల్-హైదరాబాద్ 163 హైవేపై రఘునాథపల్లి వద్ద ఉన్న కోమల్ల టోల్ ప్లాజా



రఘునాథపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై నాలుగు చక్రాల వాహనా లపై ప్రయాణించే వారికి ఇప్పటి వరకు భారంగా మారిన టోల్ రుసుముల నుంచి స్వాతంత్ర్య దినోత్సవమైన పంద్రాగస్టు నుంచి ఉపశమనం పొందే అవకాశం ఏర్పడింది. వ్యాపారేతర తెల్ల నేమ్ ప్లేట్ నంబర్ గల వాహనదారులు రూ.3 వేలు చెల్లించి వార్షిక టోల్ పాస్ తీసుకుంటే దేశంలో ఎక్కడైనా జాతీయ రహదారిపై ఉండే టోల్ ప్లాజాలలో 200 ట్రిప్పులు తిరగవచ్చు. వార్షిక టోల్ పాస్‌తో టోల్ ప్లాజాలో సైతం రయ్..రయ్..మంటూ వెళ్లిపోవచ్చు...ఈ విధానంతో సామాన్య, మధ్యతరగతికి చెందిన ప్రజల కార్లు, జీపులు తదితర సొంత వాహనదారులకు ఊర ట కలిగింది. టోల్ చార్జీల భారం తగ్గడంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వార్షిక టోల్ పాస్ వాణిజ్య వాహనాలు, ట్యాక్స్ ప్లేట్ నంబర్ ఉన్న కార్లకు వర్తించదు. అలాగే రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్ ప్లాజాలకు, ప్రైవేటు టోల్‌లకు సైతం వర్తించదు.

రూ. 3 వేలు.. 200 ట్రిప్పులు

» వార్షిక 'టోల్' పాస్‌తో తగ్గిన ఆర్థిక భారం
» రూ.16 వేల నుంచి రూ.19 వేల వరకు ఆదా
» హ్యాపీ టోల్ ప్లాజా అంటూ.. వెళ్తున్న వాహనదారులు

గతంలో నెలవారీ పాస్ మాత్రమే..

గతంలో ఒక టోల్ ప్లాజా వద్ద నెలవారీ పాస్ కోసం రూ.350 చెల్లిస్తే ఆ నెలలో ఆ టోల్ ప్లాజా వద్ద మాత్రమే ప్రయాణించే వెసులుబాటు ఉండేది. కానీ ఈ విధానం ప్రకారం రూ.3 వేలతో వార్షిక టోల్ పాస్ తీసుకున్న వాహనదారులు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్-వే లపై ఉన్న అన్ని టోల్ ప్లాజాల గుండా ఏడాదిలో 200 సార్లు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ పాస్ ఏడాదిలో 200 ట్రిప్పులు పూర్తయ్యే వరకు చెల్లుబాటవుతుంది.

పాస్ ఎలా పొందాలంటే..

ఆగస్టు 15 నుంచి అమల్లోకి వచ్చిన వార్షిక టోల్ పాస్ పొందాలంటే రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్‌ఏఐ వెబ్‌సైట్‌లో వాహనం నెంబర్, రిజిస్ట్రేషన్ వివరాలు నమోదు చేసి రూ.3 వేల రుసుము చెల్లిస్తే సరిపోతుంది. నమోదు చేసిన రెండు, మూడు గంటల్లో పాస్ అమల్లోకి వస్తుంది. దీనిని దేశంలోని అన్ని జాతీయ రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాలలో ఉపయోగించుకుంటూ రయ్..రయ్‌న వెళ్లిపోవచ్చు.

అలాగే ఫాస్టాగ్‌తో టోల్ ప్లాజాల నుంచి 200 సార్లు వెళితే సుమారు రూ.19 వేల నుండి రూ.25 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. వార్షిక టోల్ పాస్‌తో 200 సార్లు వెళితే రూ. 3 వేలు సరిపోతాయి. అంటే వార్షిక టోల్ పాస్ తీసుకుంటే సంవత్సరానికి రూ.16 వేల నుంచి రూ.22 వేల వరకు ఆదా అవుతాయి.. .200 ట్రిప్పులు ఎప్పుడు పూర్తయితే అప్పుడు మళ్లీ రీచార్జి చేసుకోవాలి.

వార్షిక పాస్ నిబంధనలు ఇలా..

వార్షిక టోల్ పాస్ ప్రైవేటు, వాణిజ్యేతర కార్లు, జీపులు, వ్యాన్‌లకు మాత్రమే వర్తిస్తుంది. జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్-వేలపై ఉన్న టోల్‌ప్లాజాలకు మాత్రమే పాస్ చెల్లుతుంది. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై గల టోల్‌ప్లాజాలకు వార్షిక పాస్ వర్తించదు. రాష్ట్ర రహదారులు, స్థానిక సంస్థలు లేదా పార్కింగ్‌లలో ఫాస్టాగ్, సాధారణ రుసుములు వర్తిస్తాయి. పాయింట్ ఆధారిత టోల్ ప్లాజాలలో ప్రతి క్రాసింగ్ ఒక ట్రిప్‌గా, క్లోజ్డ్ టోల్‌ప్లాజాలలో ఒక ఏంట్రీ -ఎగ్జిట్ జత ఒక ట్రిప్‌గా పరిగణిస్తారు. పాస్ కొనుగోలు చేసిన తేది నుంచి ఏడాది లేదా 200 టోల్‌ప్లాజా క్రాసింగ్‌ల వరకు పాస్ చెల్లుబాటవుతుంది. వార్షిక పాస్ బదిలీ చేయడానికి వీలు లేదు. నమోదు చేసిన వాహనానికి మాత్రమే వర్తిస్తుంది.

మట్టి విగ్రహాలకు జై..

- ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- పెద్ద సంఖ్యలో విగ్రహాల తయారీ
- అన్ని చోట్ల అమ్మకానికి సిద్ధం

కొలువుదీరుతున్న గణనాథులు

హనుమకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలు ఈనెల 27నుంచి ప్రారంభం కాబోతుండడంతో వినాయక విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయి. జిల్లా, మండల కేంద్రాల్లో అమ్మకానికి సిద్ధం చేసిన విగ్రహాలు బారులు తీరి కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా విగ్రహాల కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తోంది. గణపతి నవరాత్రులు మొదలు కావడానికి ఇంకా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో విగ్రహాలను కొనుగోలు చేయడానికి ఉత్సవాల నిర్వాహకులు, భక్త మండళ్ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. విగ్రహాలను పరిశీలించి తమకు నచ్చిన వాటిని అడ్వాన్సులు చెల్లించి ముందే బుక్ చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి సైతం జిల్లా కేంద్రాలకు వచ్చి విగ్రహాలను రిజర్వు చేసుకుంటున్నారు. కొందరైతే అప్పుడే ట్రాక్టర్లలో వాటిని తీసుకెళ్తున్నారు. చాలా మంది ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలవైపే మొగ్గు చూపుతున్నా పర్యావరణ హితులు మాత్రం మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీలు, అపార్ట్‌మెంట్ వాసులు ఎక్కువగా మట్టి విగ్రహాలవైపే మొగ్గు చూపుతుండడం కనిపించింది. గతంలో మట్టి విగ్రహాలు పీవోపీ విగ్రహాల అంతా ఉండేవి కావు. కానీ ఇప్పుడు తయారీలో కొత్త విధానాలను అనుసరించడం ద్వారా పీవోపీలకు ఏమాత్రం తీసిపోనిరీతిలో మట్టి వినాయక విగ్రహాలను సైతం అందంగా తయారు చేస్తుండడంతో వాటినే కొనుగోలు చేయడానికి ఎక్కువ ఇష్టపడుతున్నారు.

మట్టి వినాయకులకు ఆదరణ

వినాయక చవితికి నెల రోజుల ముందుగానే చాలా మంది మట్టి విగ్రహాల తయారీకి అర్డర్స్ ఇచ్చి తయారు చేయించకుంటున్నారు. బిహార్, కోల్‌కతా, మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కుటుంబాలు ఇప్పటికీ పీవోపీ విగ్రహాలనే తయారు చేస్తున్నారు. స్థానికులు మాత్రం మట్టి విగ్రహాలను రూపొందిస్తున్నారు. వీటి ధరలు కూడా విగ్రహం ఎత్తును బట్టి రూ. 2వేల నుంచి రూ. 20వేల వరకు ఉన్నాయి. పీవోపీ కన్నా ఒకింత తక్కువగానే ఉన్నాయి. అయితే పీవోపీ విగ్రహాల అంత ఎత్తు, ఆ రకమైన డిజైన్లలో వీటిని చేయలేకపోతున్నారు. ఇందుకు కారణం వాటి బరువు పెరగడం, ఖర్చు కూడా అధికం కావడం.

ఎకో ఫ్రెండ్లీ గణేష్

చాలా మంది ఎకో ఫ్రెండ్లీ గణేషుడిని పూజించేందుకు మక్కువ చూపుతున్నారు. ఇంటింటనే కాదు అనేక గణేష్ మండపాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించేందుకు ఇష్టపడుతున్నారు. ఇది వరకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేసిన విగ్రహాలనే ఎక్కువగా పూజించేవారు. చూడడానికి ఇవి ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో చాలా మంది వీటినే ప్రతిష్ఠించడానికి ఆసక్తి కనబరిచేవారు. పీవోపీతో అందమైన విగ్రహాలను తయారు చేసి వాటికి వివిధ రంగులను జోడించి తయారు చేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు అవి విషపూరితమైన కెమికల్స్‌ను విడుదల చేయడం వల్ల పర్యావరణానికి హాని కలిగేది. అయితే కరోనా మహమ్మారి తర్వాత 'గో గ్రీన్ సేవ్ లైఫ్' పేరుతో ఎకో ఫ్రెండ్లీ వినాయకులను తయారు చేయడం, మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించడం వంటివి మొదలు పెట్టి వాటినే ప్రస్తుతం ట్రెండ్‌గా సెట్ చేసుకుంటున్నారు. ఇప్పుడు ఎక్కువ మంది మట్టి విగ్రహాలను పూజించేందుకు, భక్త మండళ్లు వాటినే ప్రతిష్ఠించేందుకు ముందుకు వస్తున్నారు. దీనితో మట్టి విగ్రహాలకు క్రమం గా డిమాండ్ పెరగడంతో తయారీదారులు పీవోసీ నుంచి మట్టి విగ్రహాల వైపు మళ్లుతున్నారు. ఆ మేరకు పీవోసీ విగ్రహాలతో పోటీ పడేలా అంతకన్నా అందంగా ఉండేలా మట్టి గణపతులను రూపొందించి మార్కెట్‌లో విక్రయానికి పెడుతున్నారు.


వరంగల్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి గణనాథులు

జోరుగా మట్టి విగ్రహాల తయారీ

ప్రస్తుతం వరంగల్ నగరంలో పలుచోట్ల రోడ్ల పక్కన అమ్మకానికి పెట్టిన గణనాథుల విగ్రహాల్లో ఇవే ఎక్కువగా ఉన్నాయి. పీవోసీ కన్నా మట్టి విగ్రహాలను తయారు చేయడం కొంచెం కష్టమే. అయితే పీవోసీ విగ్రహాల తయారీకయ్యే ఖర్చుతో పోల్చితే కొంత మేర చౌకే. పైగా విగ్రహాల తయారీలో ఉపయోగించే ముడిసరుకు స్థానికంగానే దొరుకుతుంది. కాస్త నైపుణ్యం, సృజనాత్మకతను జోడిస్తే మట్టి విగ్రహాలను మరింత అందంగా తయారు చేయవచ్చునని చెబుతున్నారు విగ్రహ తయారీదారులు. ధార్మిక సంస్థలు, పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఇటీవల దీనిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం కూడా మట్టి వినాయకుల పట్ల ఆదరణ పెరగడానికి కారణంగా చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు చాలా మంది తయారీదారులు మట్టి విగ్రహాలను తయారు చేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో మట్టి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి విగ్రహాల తయారీ ఒక కుటీర పరిశ్రమల సాగుతోంది. పల్లెల్లో పొలాల్లోని మట్టి, స్థానికంగా దొరికే ఎండుగడ్డి, కొబ్బరిపీచు, కర్రలను ఉపయోగించి భారీ ఎత్తున మట్టి విగ్రహాలను తయారుచేసి పట్టణాలకు తీసుకువచ్చి అమ్ముతున్నారు. అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా మట్టి గణనాథులే దర్శనమిస్తున్నాయి.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించండి..
కాజీపేట పురుషోత్తం, యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, హనుమకొండ



పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి. ఎక్కువ మంది ఇప్పటికీ పీవోపీ విగ్రహాలనే ప్రతిష్ఠిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. పీవోపీ విగ్రహాల వల్ల పర్యావరణం కలుషితమవుతుంది. ఈ విగ్రహాల్లో ఉపయోగించే రసాయనాలు కోబాల్ట్, నికెల్, అర్సెమిని, క్రోమియం లాంటి క్యాన్సర్ కారక రంగులు నీటి కాలుష్యానికి కారణమవుతున్నాయి. నీటిలోని జలచరాలు, పశువులు, మానవులకు శారీరక, మానసిక రుగ్మతలు కలుగుతున్నాయి. క్యాన్సర్ బారిన పడుతున్నారు. చెరువుల చుట్టూ ఉన్న బోరు బావుల్లోకి బార మూలకాలు, కాలుష్యం బారిన పడుతున్నాయి. రసాయన గణేష్ విగ్రహాల తయారీని ప్రభుత్వం నిషేధించాలి. ఒక వార్డుకు ఒక విగ్రహం అదీ మట్టి విగ్రహం ఉండేలా పోలీసులు, కాలుష్య నియంత్రణ మండలి, గణేష్ ఉత్సవ కమిటీ చర్యలు తీసుకోవాలి.

విక్రయానికి పీవోపీ గణేశులు

మట్టి వినాయక విగ్రహాలతో పాటు పీవోపీ విగ్రహాలు కూడా వరంగల్‌లో పెద్ద ఎత్తున తయారు చేశారు. ఇవి అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. పాత వరంగల్ సెంట్రల్ వద్ద పెద్దఎత్తున విక్రయానికి ఉంచారు. మూడు అడుగుల నుంచి 20 అడుగుల ఎత్తు వరకు ఉన్న ఈ విగ్రహాల ధర రూ. 6వేల నుంచి రూ. 45వేల వరకు ఉన్నాయి. కిందటేడు లాగానే ఈసారీ పెద్దఎత్తున వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. వర్షాలు పుష్కలంగా కురవడంతో చెరువులు, కుంటలు పూర్తిగా నిండి కళకళలాడుతున్నాయి. దీనితో గణపతి నవరాత్రోత్సవ నిర్వాహకులు గణపతులను ప్రతిష్ఠించేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. కొత్తగా ఏర్పడిన యువజన సంఘాలు, భక్తమండళ్లు నవరాత్రుత్సవాల నిర్వహణకు దాతల నుంచి పెద్ద ఎత్తున విరాళాలు సేకరిస్తున్నారు. పోటాపోటీగా ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్ల చేసుకుంటున్నారు. ఇప్పటికే అనేక చోట్ల మండపాలు వెలిశాయి.

ముస్తాబవుతున్న మహా గణపతి..
45 అడుగుల ఎత్తుతో సిద్ధమవుతున్న మట్టి విగ్రహం

మట్టెవాడ (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు 3 రోజులు మాత్రమే ఉండటంతో మండపాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వరంగల్ ఎల్లంబజార్‌లో ఆకుతోట సంజీవ్ ఆధ్వర్యంలో 45 అడుగుల విజయగణపతి మట్టి విగ్రహాన్ని సిద్ధం చేస్తున్నారు. ఒడిషాకు చెందిన శిల్పి జయదేవ్ ఆధ్వర్యంలో విగ్రహం రూపుదిద్దుకుంటోంది. ఆదివారం సాయంత్రం వరకు రంగులు అద్దడం పూర్తయింది.

- విజయ గణపతి రూపం ఇలా..
- ఎత్తు 45, వెడల్పు 18 అడుగులు
- నిర్మాణానికి పట్టిన సమయం 25 రోజులు
- పాల్గొన్న కళాకారులు 15 మంది

విగ్రహం తయారీకి వాడినవి..

ఉత్తరప్రదేశ్ ప్రయాగ నుంచి 500 కేజీల మట్టి.. భద్రకాళి చెరువు మట్టి 250 బ్యాగులు
- ఉనుక, గడ్డి, రాగడి, వెదురుబొంగులు
- విగ్రహానికి బంగారు వర్ణంలో సహజమైన రంగు
- బరువు 6 టన్నులు
- పరిసరాల ప్రాంతాల్లో 150 హెడ్‌లైట్లు ఏర్పాటు

గణపతులు రెడీ

వరంగల్ కల్చరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అంగరంగ వైభవంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకునే గణపతి ప్రతిమలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ములుగు రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై అమ్మకానికి పెట్టారు. ఆదివారం నుంచి వినాయక విగ్రహాలు కొనుగోళ్లు మొదలయ్యాయి.


వరంగల్ ఎంజీఎం వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

ఉత్తర తెలంగాణకు ఇక్కడి నుంచే..

ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, జగిత్యాల, కోరుట్ల, కరీంనగర్, ఖమ్మం, భూపాలపల్లి, సూర్యపేట, మిర్యాలగూడ ప్రాంతాల నుంచి విగ్రహాల కొనుగోలుకు ఇక్కడికే వస్తారు. ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకెళ్తారు.

రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు..

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలు రూ.2 వేల నుంచి ప్రారంభమై రూ.30 వేల వరకు ధర పలుకుతున్నాయి. నిర్వాహకులు వారివారి ఆర్థిక వనరులను బట్టి వారికి అందుబాటు ధరలో ఉ్న విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

మట్టి విగ్రహాలకు ధర ఎక్కువ

పీవోపీ విగ్రహాలతో పోలిస్తే మట్టి ప్రతిమలకు ధర ఎక్కువగా ఉంది. ఇవి రూ.3వేల నుంచి రూ. లక్షా70 వేల వరకు విక్రయిస్తున్నారు. మున్సిపాల్ కార్పొరేషన్ పక్కన పోతన రోడ్డు, భద్రకాళి రోడ్డు ప్రాంతాలలో మట్టి విగ్రహాలను ఆర్డర్‌పై తయారు చేసి ఇస్తున్నారు.

రూ. కోట్లలో వ్యాపారం

వినాయక చవితి పర్వదినం వచ్చిందంటే వరంగల్ నగరంలో అమ్మకాలు జోరుగా ఉంటాయి. యేటా సుమారు రూ.5కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. చిన్న పెద్ద అన్నీ కలుపుకొని దాదాపు లక్షకు పైగా విగ్రహాలు అమ్ముడుపోతాయని అంటున్నారు.

బంజారుల సంస్కృతికి ప్రతీక తీజ్


సేవాలాల్, జగదాంబ చిత్రపటాల వద్ద పూజలు చేస్తున్న గిరిజనులు

జనగామ రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బంజారుల భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ తీజ్ అని మాజీ కౌన్సిలర్ వాంకుడోత్ అనిత అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో ఘనంగా తీజ్ వేడుకలను నిర్వహించారు. మహిళలు, యువతులు సంప్రదాయ నృత్యాలు చేసి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్, మేరమా యాడి, జగదంబ మాత ఆశీస్సులతో బంజారులు తీజ్ పండుగను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఏటా శ్రావణంలో తీజ్ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. యువతులు తమకు మంచి వరుడు దొరకాలని, సకాలంలో వర్షాలు కురిసి పండి రైతులు సుఖ సంతోషాలతో జీవించాలని తొమ్మిది రోజులపాటు నవధాన్యాల మొలకలకు పూజలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు లక్ష్మీనారాయణ నాయక్, రఘు, బాలాజీ, స్వప్న, ప్రదీప్, శంకర్, నాయకులు వంశీ, లాల్యా, పద్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని చంద్రుతండా గ్రామ పరిధిలోని మానిసింగ్ తండాలో గిరిజనులు భక్తిశ్రద్ధలతో ఆదివారం తీజ్ ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సంత్‌సేవాలాల్, జగదాంబ చిత్రపటాల వద్ద ప్రత్యేక పూజలు అచరించారు. అనంతరం బంజారా యువతులు 9 రోజులు పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో పెంచిన గోధుమ మొలకల బుట్టలను తలపైన ఎత్తుకొని యవతులు, మహిళలు నృత్యం చేస్తూ సందడి చేశారు. డీజే పాటల నృత్యాలతో, సంప్రదాయ నృత్యాలు చేస్తూ గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లి బుట్టలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా బంజారాలు మాట్లాడుతూ పూర్వకాలం నుంచి వస్తున్న ఆచారాలను, సంప్రదాయాలను కొనసాగించడంలో భాంగా తీజ్ ఉత్సవాలను ప్రతీ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భూక్య హరస్, శంకర్, దేవ్‌సింగ్, రవి, రాములు, రవీందర్, ఫకీరా, శ్రీనివాస్, హేము, విజయ్, శ్వేత, నవ్య, కావ్య, అర్చన తదితరులు పాల్గొన్నారు.


తీజ్ పాల్గొన్న యువతులు, మహిళలు

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రఘునాథపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పల్లెలు మురిసేలా... ఉండాలనే లక్ష్యంతో మండలంలోని పలు గ్రామాలలో 'పనుల జాతర' కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలతో పాటు ఇతర అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం శంకుస్థాపన చేయనున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గబ్బెటలో ఉదయం 9.30 గంటలకు, కంచనపల్లిలో ఉదయం 10 గంటలకు, ఎల్లారెడ్డిగూడెంలో ఉదయం 11 గంటలకు, రఘునాథపల్లి మండల కేంద్రంలో ఉదయం 11.30 గంటలకు, కుర్చపల్లిలో మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

జనగామ కల్చరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గుడాల భూమయ్య జ్ఞాపకార్థంగా చెస్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఆదివారం గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెస్ చాంపియన్ షిప్ స్కూల్ లెవల్ పోటీలు స్థానిక గీతాంజలి స్కూల్లో జరిగాయి. అండర్ - 9, అండర్ - 14 విభాగాల్లో విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో రిత్విజు, సాకేత్, విహాన్, అక్షిత్, సంజయ్, దీక్షిత్, రేవంత్, వైభవ్, కృష్ణ పాల్గొన్నారు. వీరిని ఫౌండేషన్ ప్రతినిధులు గుడాల శ్రీను, వేణు, శ్రీధర్, ప్రిన్సిపాల్ శిల్ప, నిర్వాహకుడు కాసాల సంతోష్‌కుమార్ అభినందించారు.

మద్యం తాగి వాహనం నడుపొద్దు

చిలుపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకేనని రిజిస్ట్రేషన్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పల్లగుట్ట క్రాస్‌రోడ్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలతో పాటు, వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురి వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై నవీన్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతీఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనం నడిపితే జైలుకు వెళ్ళక తప్పదని హెచ్చరించారు. ఎస్సై వెంట కానిస్టేబుళ్ళు ఇంద్రాచారి, వీరన్న, శ్రీనాథ్ ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

జఫర్‌గఢ్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జఫర్‌గఢ్ మండలం కూనూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన సిహెచ్.పూజశ్రీ (10వ తరగతి) జాతీయ స్థాయికి ఎంపికైంది. ఆదివారం కొమురం భీం జిల్లా గోలేటిలో జరిగిన మహిళల బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తరఫున కూనూరు హైస్కూల్‌కు చెందిన సీహెచ్.పూజశ్రీ, సుతారి రిషిత పాల్గొన్నారు. వీరి ఉత్తమ ప్రతిభతో వరంగల్ జట్టు రెండో స్థానం సాధించింది. ఇందులో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన పూజశ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్‌ఎం ఎండి.పర్వేజ్ తెలిపారు. క్రీడా ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికైన పూజశ్రీతో పాటు రిషిత, పీడీ సాయికుమార్‌లను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

విహార యాత్రకు బచ్చన్నపేట విద్యార్థులు

బచ్చన్నపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం విజ్ఞాన్, విహార యాత్రకు వెళ్లినట్టు హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రపతి నిలయం, అసెంబ్లీ, మ్యూజియం, పురావస్తు ప్రదర్శనశాల, ఎన్‌టీఆర్ గార్డెన్, అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్ తదితర ప్రదేశాలను దర్శించి అనుభూతి పొందినట్టు తెలిపారు. ఈ విహార యాత్ర ద్వారా విద్యార్థులు చారిత్రక, సాంస్కృతిక వారసత్వం పట్ల, ప్రాచీన కళలు, పురాతన వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ వ్యవస్థ, ప్రకృతి అందాల వీక్షణం ద్వారా విజ్ఞానం పెంపొందించుకునేందుకు దోహద పడిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుధాకర్ రెడ్డికి ఘన నివాళులు

రఘునాథపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతి సిపిఐకి తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కావటి యాదగిరి అన్నారు. మండలంలోని కంచనపల్లి గ్రామంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి సీపీఐ నాయకులు ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కందుకూరి మల్లేష్, మడికంటి సోమన్న, దామెర అబ్బయ్య, సాదం అశోక్, డాన్యేల్, వెంకటయ్య, దయాకర్, సుధాకర్, ప్రవీణ్, ఏలియా, శోభన్ బాబు, లత తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి

పాలకుర్తి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు మేడిద ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత పరుస్తామన్నారు. సమావేశంలో నాయకులు మాచెర్ల సాంబరాజు, ఆకుల సైదులు, మాడరాజు అశోక్, భూక్యా బాలూనాయక్, పూజారి సాయి ఉన్నారు.

యూరియా కోసం రైతుల బారులు


నర్మెట పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

నర్మెట, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): నర్మెట మండలకేంద్రంలో రైతులు యూరియా కోసం ఆదివారం బారులు తీరారు. ఖరీఫ్ సాగులో రైతులకు సరిపడా యూరియా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నర్మెట పీఏసీఎస్‌కు యూరియా లోడ్ రావడంతో రైతులు ఉదయం నుంచే క్యూ లైన్ కట్టారు. పీఏసీఎస్‌లో 333 యూరియా బస్తాలు ఉన్నాయని, క్యూ కట్టిన రైతులకు యూరియా బస్తాలు అందుతాయని పీఏసీఎస్ సీఈవో కొన్నె వెంకటయ్య తెలిపారు. యూరియా కొరత లేకుండా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ వారిపై కక్ష్య సాధింపు

కొడకండ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలపై పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి కక్ష్య సాధింపులు పనులు చేస్తుందని దేవరుప్పుల పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో ఆధివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణమూర్తి మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన వారిని పార్టీలో చేర్చుకోని, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పని చేసిన కార్యకర్తలను ఎమ్మెల్యే యశ్వసినిరెడ్డి, ఝాన్సీరెడ్డి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలోకి దిగుతామని హెచ్చరించారు. పాలకుర్తి గడ్డ పోరాటల గడ్డ అని అమెరికా కాదని ఎద్దేవా చేశారు.

పేదలకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం


ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఇటీవల అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని శివునిపల్లి గ్రామానికి చెందిన అయిత లింగయ్య శస్త్రచికిత్స కోసం రూ 1.5లక్షల ఎల్వోసీని బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం హనుమకొండలో ఆయన నివాసంలో కడియం అందించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బూర్ల శంకర్, నాయకులు నీల రాములు, వాంకుడోతు దశరథ్‌నాయక్, ఆరెల్లి అశోక్, అయిత సంతోష్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన నేతలు


మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జంగా రాఘవరెడ్డి తదితరులు

నర్మెట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు మచ్చ వరలక్ష్మి తల్లి మడికొండ అండాలు(75) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. కాగా మృతురాలి కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. వారు వెళ్లిన గంట సమయం తర్వాత ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి, జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మినారాయణ, నర్మెట గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, జిల్లా కార్యదర్శి భూక్య జయరాం, బైరగోని అంజయ్య, కన్నెబోయిన రామకృష్ణ, బాల్‌సింగ్, సారాబు మధు తీగుళ్ల భూపతిరెడ్డి, కొన్నె తిరుపతి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్ నాయక్

కొడకండ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులు సిద్ధం కావాలని కొడకండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేశ్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం గ్రామ పార్టీ అధ్యక్షుడు మాసురం రవీందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సన్నాహాక సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా సురేశ్ నాయక్ హాజరై మాట్లాడారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేశాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ నాయక్, నాయకులు ధర్మపు బిక్షపతి, పసునూరి మధుసూధన్, అందె యాకయ్య, దూదిమెట్ల యాకేశ్, అందె శ్రీవార్ల, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘనపూర్ మునిసిపాటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ఎక్కడ చూసిన మురుగునీరు వ్యాంపించి దోమల నివాస యోగ్యంగా మారి ప్రజలు డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టింపులేనట్లు వ్యవహరించడం సరికాధని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ మండి పడ్డారు. ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణంలో 1వ, 13వ, 15వ, వార్డులను సీపీఎం నాయకులు సందర్శించి పరిశీలించారు. అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో మునిసిపాలిటీ ఎదుట ఆందోళన చేబడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చిలుముల్ల భాస్కర్, భూశెట్టి రాంబాబు, అమరాజు బాబు, దామోదర్ రెడ్డి, వారాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల తరువాత మీదికొండకు నిధులు


సమావేశంలో మాట్లాడుతున్న నాగరబోయిన శ్రీరాములు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి బాధ్యతలు చేబట్టిన తరువాత గ్రామానికి నిధులు పెద్ద ఎత్తున వచ్చాయని స్టేషన్‌ఘన్‌పూర్ బ్లాక్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నాగర బోయిన శ్రీరాములు తెలిపారు. ఆదివారం మీదికొండలో ఆయన మాట్లాడారు. కడియం ఎమ్మెల్యే అయిన తరువాత గ్రామంలోని గోవర్ధనగిరి రోడ్డు నుంచి కొత్తపల్లికి వెళ్లే రోడ్డు వరకు రూ 50లక్షలతో సీసీ రోడ్డును మంజూరు చేశారని, ఆంగన్‌వాడీ భవనానికి రూ 12లక్షలు, పద్మశాలి సంఘం భవన ంకు రూ 10లక్షలు, యాదవ సంఘం భవనానికి రూ 10లక్షలు మంజూరి చేశారని తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో కడియం సీసీ రోడ్డును ప్రారంబించడంతో పాటు, అంగన్‌వాడీ భవనం, పద్మశాలి, యాదవ సంఘం భవనాలకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. అదేవిధంగా మల్లన్న గండి రిజర్వాయర్ ద్వారా మీదికొండ గ్రామంలోని చెరువులు, కుంటలు నిండనున్నాయని, తద్వారా గ్రామంలోని సుమారు 15,00 ఎకరాలకు గోదావరి జలాలు అందనున్నాయని తెలిపారు. కడియం పర్యటనను గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడిపై హత్యాయత్నం కేసు

(5వ పేజీ తరువాయి)

శంకర్‌తో కలిసి అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అలాగే భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22న రాత్రి డ్యూటీలో ఉన్న సైన్స్ ఉపాధ్యాయుడు రాజేందర్ తాగునీటి ట్యాంక్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన విషయాన్ని విద్యార్థులు తమకు తెలిపారన్నారు. తెల్లవారి టిఫిన్ చేసిన అనంతరం నీళ్ల తాగిన విద్యార్థులకు వాసన రావడంతో అనుమానం వచ్చి మిగతా వారిని తాగనీవకుండా చేశారని తెలిపారు. ఈ క్రమంలోనే నీళ్ల తాగిన విద్యార్థులు అస్వస్థతకు గురి కాగా ప్రత్యేక అధికారి వెంకటనర్సయ్య ఆస్పత్రికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు.

మూడో రోజు కొనసాగిన నిరసన

బచ్చన్నపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని రిటైర్డ్ అర్చకుడు సంగమేశ్వర్ కుటుంబం చేపట్టిన నిరసన మూడో రోజుకు చేరుకుంది. సిద్దులగుట్ట వద్ద నోటికి నల్లబట్ట కట్టుకుని తమ నిరసన కొనసాగించారు. సంగమేశ్వర్, ఓంకార్, నందీశ్వర్, చంద్రప్రకాశ్, చరణ్‌కుమార్, కిశోర్, కోటేశ్వర్, జగన్మాత, లీల, రేణుక, అంబిక, అనసూయమ్మలు పాల్గొన్నారు.

కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా మల్లేశం



జనగామ రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కురుమ సంఘం జనగామ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని శ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో సంఘం గౌరవాధ్యక్షుడు మోటె లింగయ్య అధ్యక్షతన, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సెవెల్లి సంపత్, జిల్లా అధ్యక్షుడు కంచె రాములు పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బాల్దె మల్లేశం, కార్యదర్శిగా జూకంటి శ్రీశైలం, కోశాధికారిగా కేమిడి ఉపేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ రెండు సంవత్సరాలలో బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణం పూర్తి చేసి బీరప్ప ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మోటె పర్వతాలు, మోటె శ్రీశైలం, మోటె శ్రీనివాస్, జాయ మల్లేశం, కర్రె కృష్ణ, కడకంచి మధుసూదన్, మంత్రి శ్రీశైలం, వైకుంఠం, కర్రె శ్రీను, బాల్దె ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎడమకాలువ పనులను తక్షణమే చేపట్టాలి

చిలుపూర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మల్లన్నగండి రిజర్వాయర్ ఎడమకాలువ పనులను తక్షణమే చేపట్టి రైతాంగానికి సాగునీరందించాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కృష్ణాజీగూడెంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పల్లగుట్ట, కృష్ణాజీగూడెం, ఫతేపూర్, గార్లగడ్డ, మల్కాపూర్ తదితర గ్రామాలకు తలాపున నీళ్ళున్నా సాగునీటి కోసం ఇక్కడి రైతులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు గద్ద కుమార్, నాయకులు నారబోయిన బిక్షపతి, సాదం రామరాజు, జక్కుల యాదగిరి, కుంచాలగణేశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు తరలిరావాలి

బచ్చన్నపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సాల్వాపూర్ గ్రామ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఈనెల 25న కలెక్టరేట్‌కు తరలి వెళ్లేందుకు సిద్ధమవ్వాలని బహుజన సామాజిక ఉద్యమకారుడు బండకింది సింగరయ్యాగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైనా, గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికి అధికారులు చర్యలు తీసుకోకపోవటంపై, అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్ల కోసం, సాల్వాపూర్ నుంచి శబాష్‌గూడెం వరకు రోడ్డు పనులు పూర్తి చేయడం కోసం కలెక్టర్‌ను కలిసి నివేదించేందుకు తరలి వెళ్లాలన్నారు. . బచ్చన్నపేట మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి ఒకరు తరలి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలన్నారు.

స్నేహితుడి కుటుంబానికి మిత్రుల సాయం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రానికి చెందిన రేండ్ల రాజు(హెడెన్) ఇటీవల మృతి చెందగా ఆదివారం స్నేహితులు మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఇ.రాజ్‌నారాయణ, జి.రాజు, బి.లక్ష్మి, రేండ్ల సమ్మయ్య, శ్రీనివాస్, టి.రవి, చట్ల రామ్ కన్న, గట్టు వినయ్, ఎం.మోహన్, చిరంజీవి, గన్ను సురేష్, జి.మురళి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

బచ్చన్నపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్తంబంపై బిగించిన డిస్క్ ఫెయిల్ కావడంతో వైరు తెగిపడి మేత మేస్తున్న పాడిగేదెపై పడడంతో మృతి చెందిన సంఘటన ఆదివారం బచ్చన్నపేట సబ్‌స్టేషన్ సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన పాతూరి రాజిరెడ్డికి చెందిన గేదెలు మేత మేస్తుండగా, ఒక్కసారిగా డిస్క్ పెద్ద శబ్దంతో పేలిపోయి వైరు తెగి కిందపడిందన్నారు. ఆసమయంలో సూడిగేదే అక్కడే ఉండటంతో వైరు తగిలి షాక్ గురై మృతి చెందింది. దీని విలువ రూ. 1.20 లక్షలుంటుదని బాధిత రైతు తెలిపాడు.బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ రైతులు కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు :సీపీ

వరంగల్ క్రైం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో వికృత చేష్టలకు పాల్పడుతూ ర్యాగింగ్ పేరుతో హింసిస్తే అలాంటి విద్యార్థులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. విద్యాసంస్థల్లో ప్రవేశాలు జరుగుతున్న తరుణంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ర్యాగింగ్ నియంత్రణపై పత్రికా ప్రకటన విడుదల చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడటం అనేది తీవ్రమైన నేరమని, తద్వారా భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. సీనియర్ల పేరుతో జూనియర్లను ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే విద్యాసంస్థల నుంచి అడ్మిషన్ రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యాసంస్థలు ర్యాగింగ్ నియంత్రణకు ప్రత్యేకంగా ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి, నూతనంగా ప్రవేశాల పొందే విద్యార్థులపై పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలన్నారు. దౌర్జన్యాలు, అసభ్యపద జాలంలో వేధిస్తే వెంటనే ప్రిన్సిపాల్‌తోపాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ర్యాగింగ్ అనేది విద్యార్థుల భవిష్యత్‌పైనే కాకుండా సమాజంపై సైతం ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. విద్యాసంస్థలు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు కలిసి పనిచేసినప్పుడే ర్యాగింగ్‌ను నిర్మూలించగలుగుతామన్నారు.

పండుగ చేద్దాం.. పైలంగా..

(5వ పేజీ తరువాయి)

రూ.11 వేల వరకు, 15 ఫీట్లవి రూ.15వేల నుంచి రూ.20వేలు అలాగే, 20 ఫీట్ల నుంచి ఆపైన ఎత్తుగల విగ్రహాలకు రూ.22వేల నుంచి విక్రయిస్తున్నారని గణేష్ మండపాల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఘర్షణలకు తావివ్వొద్దు : డీసీపీ రాజమహేంద్ర నాయక్

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి. ఎత్తైన విగ్రహం పెట్టేవారు విద్యుత్ వైర్లు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. యువత స్నేహపూర్వకంగా మెలగాలి. ఘర్షణలకు తావివ్వొద్దు. ఉత్సవ కమిటీలు పోలీసు సూచనలు పాటించాలి.

ప్రమాదాలను నివారించాలి : వేణుమాధవ్, ఎస్ఈ, జనగామ

గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మండపాలకు విద్యుత్ కొరకు ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఎత్తైన విగ్రహాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ ప్రమాదం జరిగినా, విద్యుత్ సరఫరాలో అతరాయం ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలి.

యూరియా ఇవ్వలేని స్థితిలో రేవంత్ ప్రభుత్వం : ఎర్రబెల్లి

దయాకర్‌రావు సమక్షంలో 250 మంది బీఆర్ఎస్‌లో చేరిక

పాలకుర్తి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : యూరియా బస్తాల కోసం గంటల తరబడి రైతాంగం నిలబడాల్సిన పరిస్థితి కాంగ్రెస్ పాలన తీసుకువచ్చిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆవేధన వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని దర్దెపల్లి, చీమలభాయితండా, మంచుప్పుల, దుబ్బతండా (ఎస్సీ) గ్రామాల కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్య నాయకులు సిద్దం యుగేంధర్, తాడిశెట్టి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ రాంధన్, బన్సీలాల్, మోకాటి యాదగిరి,వేల్పుల సోమయ్య, బాదావత్ ప్రశాంత్, వెంకటేష్ పాటు 250 మంది బీఆర్ఎస్‌లో దయాకర్‌రావు మక్షంలో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ ఆనాడు కేసీఆర్ హయాంలో మోటార్లు కాలలేదు, ట్రాన్స్ ఫార్మర్లు కాలలేదు.. ఫించన్లు ఇస్తే పెద్దకొడుకని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిండు, తెల్లారి లేస్తే చాలూ రేవంత్‌రెడ్డిని జనం తిట్లపురాణం మొదలు పెడుతున్న దుస్థితి ప్రభుత్వ అధినేతకు దక్కిందని విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కర్రు కాల్చి వాతపెట్టాలని అన్నారు. కష్టకాలంలో మనతో కలిసి వస్తున్న కార్యకర్తను కాపాడు కోవాల్సిన అవసరం ఉందన్నారు. నేనెక్కడికి పోను.. పాలకుర్తి గడ్డ దయన్న అడ్డా ఇది అని అన్నారు. ఇక్కడే ఉంటా నేను ఓడిపోవడం మేలైందని, దీంతో మన విలువ జనాలకు తెలిసిందని తెలిపారు. పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, బమ్మెర పోతన మందిరాలను కేసీఆర్ హయాంలో కోట్లు నిధులు తెచ్చి రూపురేఖలు మార్చినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో కోట్లు నిధులు సీసీరోడ్లు, మారుమూల గ్రామాలకు బీటీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, పుస్కూరి శ్రీనివాసరావు, మాచెర్ల ఎల్లయ్య, కారుపోతుల వేణు, బొమ్మగాని కొంరయ్య, తాడెం రవి, వెంకటయ్య, దారావత్ బాలూనాయక్, పాలకుర్తి రాఘవరావు, వాసూనాయక్ తదితరులు ఉన్నారు.


పాలకుర్తి మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు